'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాధాకృష్ణ

మలక్‌పేట: సైదాబాద్ మండల పరిధిలో పది పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో 23 సెంటర్లు కేటాయించినట్లు మండల డిప్యూటీ ఈవో తిరునగరి రాధాకృష్ణ తెలిపారు. 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 5131 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఆన్సర్ షీట్‌లకు బదులుగా 24 పేజీల బుక్‌లెట్ ఉంటుందని, ఫిజికల్ సైన్స్‌కు 12 పేజీలు, జీవశాస్త్రానికి 12 పేజీల బుక్‌లెట్‌తో పాటు పార్ట్–బీ పేపర్ ఉంటుందన్నారు. 45 నిమిషాలకు ముందే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని, 5 నిమిషాలు ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి పంపిస్తారన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ రోడ్ నెం–14లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులు, బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ శిరీష, శ్రీనివాస్, ఖాదిర్, నేతాజీ, సువర్ణ, గణేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోద ముద్ర వేయడం ఆనందంగా ఉందని ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. న్యాయసమ్మతమైన ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు చేకూరుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు చట్టం చేసి ఆమోదింపజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఇచ్చిన మాట ప్రకారం నిబద్ధతతో మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డికి ఎస్సీల గుండెల్లో సుస్థిరమైన స్థానం ఉంటుందన్నారు. ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు, మంత్రివర్గ ఉప సంఘానికి, ఎమ్మెల్యేలకు మాదిగలు, ఉపకులాలు రుణపడి ఉంటాయన్నారు.

బధిర విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేసిన షఫీయుద్దీన్

చాదర్‌ఘాట్: విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఏకాగ్రతతో సన్నద్ధం కావాలని ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ షఫీయుద్దీన్ అన్నారు. బుధవారం నల్గొండ క్రాస్ రోడ్‌లోని ప్రభుత్వ మూగ చెవిటి విద్యార్థుల పాఠశాలలో సర్కిల్ వైద్యాధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బధిర విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు

నాగోలు: ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉత్తమ అవార్డు సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని బండ్లగూడ డిపో మేనేజర్ వెంకటేశం అన్నారు. బుధవారం డిపోలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన ప్రగతి చక్రం అవార్డు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. డిపో అభివృద్ధి కి అందరూ వీరిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కోరారు.

ఏప్రిల్‌లో ఖైదీలకు స్పోర్ట్స్ మీట్

చంచల్‌గూడ: వచ్చే నెలలో ఖైదీలకు 6వ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా ప్రకటించారు. బుధవారం ఆమె చంచల్‌గూడలోని సీకా ఆడిటోరియంలో వివిధ జైళ్ల స్పోర్ట్స్ ఇన్‌చార్జిలకు స్పోర్ట్స్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ.. 220 మంది ఖైదీలు చెస్, వాలీబాల్, క్యారమ్స్, షటిల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. త్వరలో జరగనున్న ఆల్ ఇండియా ప్రిజన్స్ స్పోర్ట్స్ మీట్‌లో తెలంగాణ జైళ్ల శాఖ సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలన్నారు. ఐజీలు రాజేష్, మురళీబాబు, డీఐజీ డా. శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు నవాబు శివకుమార్, రాంచంద్రం పాల్గొన్నారు.

మరో 3 కొత్త ఠాణాలు

- ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు
- కర్మన్‌ఘాట్, తుర్కయంజాల్, బడంగ్‌పేటలలో ఏర్పాటుకు ప్రతిపాదనలు



ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో రోజు రోజుకూ జనాభా పెరుగుతుంది. నూతన కాలనీ వస్తున్నాయి. అందుకు అనుగుణంగానే నేరాలు, కేసుల సంఖ్య కూడా పెరుగుతున్నాయి. దొంగతనాలు, అసాంఘిక కార్యకాలపాలు, నేరాల కట్టడి కోసం, ప్రజలకు రక్షణ కోసం శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం నూతన పోలీస్ స్టేషన్ ప్రతిపాదనలు చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ పరిధిలో మూడు కొత్త పోలీస్ స్టేషన్లకోసం ప్రతిపాదించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఎల్‌బీనగర్ డీసీపీ పరిధిలో ఉన్న మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసుల సంఖ్య పెరిగిపోవడంతో అక్కడున్న సిబ్బందిపై భారం పడుతుంది. దీంతో బడంగ్‌పేటలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు నిమగ్నమయ్యారు. మీర్‌పేట నుంచి బడంగ్‌పేట, గుర్రంగూడ ప్రాంతాతో పాటు శివారులోని అదిభట్ల పోలీస్ స్టేషన్ నుంచి నాదర్‌గుల్, కర్మల్‌గూడ, బాలాపూర్ నుంచి సాయినగర్ మరి కొన్ని ప్రాంతాలను కలిపి బడంగ్‌పేట పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

పెరుగుతున్న నేరాల దృష్ట్యా..

నందనవనంలో పెరుగుతున్న నేరాలు దృష్టిలో పెట్టుకొని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో మరో నూతన స్టేషన్‌కు అధికారులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి పెద్దగా ఉండటం, క్రైమ్ రేట్ పెరగడంతో కర్మన్‌ఘాట్ ప్రాంతంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి చంపాపేట, కర్మన్‌ఘాట్, నందవనంతో, టీకేఆర్ కాలేజీ, హస్తినాపురం, పిండి పుల్లారెడ్డి కాలనీ, పాత కర్మన్‌ఘట్ ప్రాంతం, సాగర్ రింగ్‌రోడ్డు గాయత్రినగర్ ప్రాంతంతో కలిపి నూతన పోలీస్ స్టేషన్ ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇందులో ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలను నూతనంగా ఏర్పాటు చేసే కర్మన్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తేనున్నట్లు సమాచారం. వనస్థలిపురం పరిధిలో తుర్కయంజాల్ ప్రాంతంలో మరో నూతన స్టేషన్ ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుర్కయంజాల్ పోలీస్ స్టేషన్‌లో మీర్‌పేట పోలీస్ స్టేషన్ రెవెన్యూ పరిధిలోని కొంత భాగం, ఆదిబాట్ల నుంచి కొంత భాగం, వనస్థలిపురం నుంచి కొంత ఏరియాతో కలిపి నూతన పోలీస్ స్టేషన్‌ల ఏర్పటుకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది.


మారనున్న సరిహద్దులు..

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో మరో మూడు కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. త్వరలోనే కొత్తగా పోలీస్ సిబ్బంది నియామకం చేసేందుకు ప్రభుత్వం సమయత్తం అవుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వానికి కొత్త పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటుపై ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుసుతుంది. వచ్చే బడ్జెట్‌లో నూతన పోలీస్ స్టేషన్లు మంజూరుకు సన్నాహాలు చేస్తున్నట్లు, జూన్ వరకు కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటైతే ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ సరిహద్దులు మారుతాయని అధికారులు వెల్లడించారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.35, దోసకాయ బీట్‌రూట్ రూ.13, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఎల్ఓసీ అందజేత



వనస్థలిపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల వైద్యం కోసం ఎంతగానో ఉపయోగపడుతోందని కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహాయాదవ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ చింతలకుంటకు చెందిన బి.యాదయ్యకు మంజూరైన రూ.3 లక్షల పత్రాలను యాదయ్యకు అందజేశారు.

ఎన్నికలను ఒకే సమయంలో నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఒకే దేశం, ఒకే ఎన్నిక భారత ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దేశంలోని అన్ని ఎన్నికలను ఒకే సమయంలో నిర్వహిస్తే ఎన్నికల ఖర్చు తగ్గుతుందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బెల్దా అశోక్‌కుమార్ అన్నారు. ఎల్‌బీనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ సమయాల్లో ఎన్నికలు జరగటంతో ఎన్నికల కోడ్ వస్తుందని, దేశ, రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ప్రభుత్వ పరిపాలన దెబ్బతినటమే కాకుండా సంక్షేమ పథకాల అమలుకు విఘాతం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహించే వివిధ శాఖల్లోని ఉద్యోగుల విధుల నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా ఎన్నికల విధుల్లో పాల్గొంటుండటంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి వికసిత భారత్ కలను సాధించుకునేందుకు ఒకే దేశం, ఒకే ఎన్నిక కార్యక్రమ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రావు, నర్సింహారెడ్డి, రవీందర్‌గౌడ్, కేశవరావు, లయ, రాంరెడ్డి పాల్గొన్నారు.

'చలో పార్లమెంట్'ను జయప్రదం చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

లింగోజిగూడ: రవాణ రంగాన్ని పరిక్షించడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 24న చేపట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి కోరారు. బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు పంచడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రవాణ రంగ సమస్యలు పరిష్కారం కోసం ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. డీజిల్ ధరలు, బీమా ప్రీమియం, టోల్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. వాహన తనిఖీలు రవాణ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి ఇందులో ఆర్టీఏ, ఏఎస్ఆర్‌టీయూసీఐలను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాములు, అశోక్, కృష్ణ, ప్రవీణ్, శ్రీహరి, నగేష్, యాదయ్య, చంద్రకాంత్, సహదేవ్, కరుణాకర్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం హర్షణీయం

చంపాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కలిస్తూ అసెంబ్లీలో ఆమోదం తెలపటం హర్షణీయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. బుధవారం చంపాపేటలోని సేవాదళ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలలో ఆమోదించిన బీసీ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదించిన వెంటనే రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించాలని కోరారు. ఈబిల్లు ద్వార బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం లభించిందని పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేది కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకే రాష్ట్రంలో బీసీల గణన చేపట్టి బీసీ బిల్లును ఆమోదం చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బండి సురేందర్, దయాకర్, రమాకాంత్ పాల్గొన్నారు.

చిన్నారులను విక్రయిస్తున్న ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: చిన్నారులను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాలోని మరో 9 మందిని అరెస్టు చేశారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి లో చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో కందుల కృష్ణవేణి, తన గ్యాంగ్ సభ్యులైన దీప్తితో పాటు మరికొంత మంది సభ్యులతో కలిసి వివిధ రాష్ట్రాల్లో చిన్నారులను అక్రమ రవాణా చేస్తున్నారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు చిన్నారులకు విక్రయించే ముఠాను ఫిబ్రవరి 24న అరెస్టు చేసి 11 మందిని గుజరాత్ ముఠాను కటకటాల్లోకి పంపించారు. ఈ ముఠాపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు జైలులో ఉన్న కోలా కృష్ణవేణి, దీప్తి, వందనలను కస్టడీలోకి తీసుకుని విచారించగా వివిధ ప్రాంతాల్లోని 25 మంది శిశువులను విక్రయించినట్లు ఒప్పుకున్నారు. కస్టడిలో ఉన్న కోలా కృష్ణవేణి, దీప్తి ఇచ్చిన సమాచారం మేరకు మలక్‌పేట చెందిన సోము అమూల్య (29) నగరంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తుంది. గతంలో దీప్తితో కలిసి అమూల్య 10 మంది శిశువులను(4 బాలురు) 6 బాలికలను వివిధ ప్రాంతాలను తీసుకువచ్చి విక్రయించినట్లు సమాచారం ఇచ్చింది. ఈ మేరకు పోలీసులు ప్రధాన నిందితురాలైన అమూల్యను బుధవారం అరెస్టు చేసి విచారణ చేయగా 8 మంది శిశువులు 4 బాలురు, 4 బాలికలను విక్రయించినట్లు అంగీకరించింది. వీరిలో 3 బాలికలు, 1 బాలుడిని రక్షించినట్లు పోలీసులు తెలిపారు.చిన్నారులను విక్రయిస్తున్న ముఠాలోని కొత్తపేట మారుతినగర్‌కు చెందిన జాన్‌పల్లి కార్తీక్ గాంధీ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కార్తీక్‌తో పాటు, నగరంలోని ఘాన్సీ బజార్‌కు చెందిన సజ్జన అగర్వాల్, అబ్దుల్లాపూర్‌మెంట్‌కు చెందిన బాణాల మంగయ్య, ఆసిఫాబాద్‌కు చెందిన బోడాసు నాగరాజు, నేరేడ్‌ట్‌కు చెందిన రామారం అశోక్, మైలార్‌దేవ్‌పల్లికి చెందిన షేక్ ఇస్మాయిల్, నిజాంపేటకు చెందిన మాచర్ల వంశీ కృష్ణ పోలీసులు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటీ డీసీపీ రమణరెడ్డి, అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్ఓటీ సీఐలు జనయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌బాబు, వెంకటేశ్వర్‌రావు, భద్రయ్య, వాసుదేవ్ పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డిపై మహిళా కమిషన్ కు ఫిర్యాదు

హస్తినాపురం: గిరిజన మహిళనని చూడకుండా తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు బుధవారం హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ ఫిర్యాదు చేశారు. స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ ఈనెల 27 న మహిళా కమిషన్ ముందు సుధీర్‌రెడ్డి హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు.

నియామకం

చంచల్‌గూడ: బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడకు చెందిన నిరంజన్‌యాదవ్ నియమితులయ్యారు. నిరంజన్ యాదవ్ 2009 నుంచి బీజేపీ, గణేష్ ఉత్సవ సమితిలో చురుకుగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఈ పదవికి ఐఎస్‌సదన్, గౌలీపురా, కుర్మగూడ డివిజన్ల నుంచి నిరంజన్‌యాదవ్, వీరేందర్‌యాదవ్, ఆలె జితేందర్, చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రూప్‌రాజ్‌ల మధ్య పోటీ ఏర్పడింది. నెల రోజుల క్రితం గౌలీపురాకు చెందిన జమాల్‌పూర్ చంద్రశేఖర్‌ను అనాధికారికంగా జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర బీజేపీ పార్టీలో వివిధ జిల్లాల అధ్యక్షులను ఎంపిక చేసే ప్రక్రియలో యాదవులకు అన్యాయం జరుగుతుందని యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తర్జనబర్జన చేసిన రాష్ట్ర నాయకత్వం దిగి వచ్చి ఎట్టకేలకు భాగ్యనగర్ జిల్లాకు యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేసింది. సోమవారం రాత్రి అధికారిక ప్రకటన చేసింది.

కార్యవర్గ సభ్యుడిగా అమర్‌నాథ్‌రెడ్డి

సైదాబాద్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఐఎస్‌సదన్ డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని కృషి చేస్తానని అన్నారు. పాతబస్తీలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలతో కలిసి శ్రమిస్తామని అన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం

నాగోలు: సద్గురు త్యాగరాజ స్వామి ఉత్సవ కమిటీ వాద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నాగోలు బండ్లగూడలోని త్యాగరాయనగర్‌లో బుధవారం నిర్వహించిన సద్గురు త్యాగరజ స్వామి 5వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని మాట్లాడారు. కర్ణాటక సంగీత త్రిమూర్తులైన త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిలలో ఒకరైన త్యాగరాజస్వామి అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సంగీత విద్యాంసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరవాయి పరమేశ్, వడ్డేమాను వెంకటేశ్వర్లు, వుండవల్లి సురేందర్, కష్టాపురం పామినేటి స్టేట్ లెవల్ సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులో పేరుంటేనే రాజీవ్ యువ వికాసానికి అర్హులు

చాదర్‌ఘాట్: వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద రాజీవ యుక వికాసం పథకం ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా జిల్లా నోడల్ అధికారి కార్యాలయంలో అందజేయాలని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయం సంస్థ అధికారులు తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయం, కులం సర్టిఫికెట్లు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్స్, మొబైల్ నెంబర్ తప్పని సరిగా ఉండాలన్నారు. రేషన్‌కార్డులో పేరున్న వారే అర్హులన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

లింగోజిగూడ: ఫీజుల కోసం 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాని కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు కోరారు.కర్మన్‌ఘాట్‌లోని శ్రీచైతన్య పాఠశాల యజమాన్యం హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని విషయం తెలుసుకున్న కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేయగా యాజమాన్యం హాల్ టికెట్లు ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని అలాంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, అమీర్, సాయి, భాను, శివ, నరేందర్ పాల్గొన్నారు.

అల్లర్లను సృష్టించేలా వ్యవహరిస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అసభ్యకరంగా మాట్లాడుతూ రెచ్చగొడుతూ అల్లర్లు సృష్టించేలా వ్యవహరిస్తే సహించేది లేదని బీజేపీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, రంగ నర్సింహ్మగుప్తా, బద్దం ప్రేమ్‌మహేందర్‌రెడ్డి, చింతల అరుణ, పవన్‌కుమార్, నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న మన్సూరాబాద్‌లో ప్రొటోకాల్ పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రెచ్చగొట్టే మాటలతో దాడులు చేస్తామని బెదిరింపులతో శాంతిభద్రతలకు విఘాతం కలిగేంచే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండారి భాస్కర్, పోచంపల్లి గిరిధర్, నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం



నాగోలు: ఎస్సీ వర్గీకరణ చట్టం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ఎమ్మార్పీఎస్ విజయమని బత్తిని సుధాకర్ మాదిగ అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ చౌరస్తా మహనీయుల విగ్రహాల వద్ద విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాదిగలకు తగిన వాటా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్ మాదిగ, రాజు మాదిగ, లింగం మాదిగ, నర్సింగ్ రావు, దేవయ్య, సురేష్ మాదిగ, మౌలాలి మాదిగ, దేవయని శేఖర్ వనపర్తి చంద్రయ్య,వేణు, సుమన్, సునీల్, జగన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆటీటి రంగేశ్వరీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రజాసంక్షేమం, అభివృద్ధిని వదిలేసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రజల కోసం గెలిచినప్పటి నుంచి ఎలాంటి పని చేయాని కార్పొరేటర్లు ప్రజల దృష్టి మరల్చేందుకు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని, ఎక్కడ లేని విధంగా ఎల్‌బీనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు చట్టాపట్టాలేసుకుని తీరుగుతున్నారన్నారు.

అందుబాటులోకి ఈతకొలను



ఈత కొలనును పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో జీహెచ్‌ఎంసీ ఈత కొలనును బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. గత కొన్ని నెలలుగా మూసిఉన్న ఈత కొలనును అధికారులు శుభ్రం చేయించి శుభ్రమైన నీటితో నింపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ ఈత కొలను పరిశీలించి మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ ఈత కొలనును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 10 వరకు, సాయంత్ర 4 గంటల నుంచి 7 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు కూర్మరావు, నాయకులు వెంకటేశ్వర్లు, హనుమంతురావు, శ్రీధర్, బాల్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.